క్లుప్తంగా

ఏరియా జీఎంకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కొత్తగూడెం ఏరియా అత్యధిక ఉత్పత్తి, రవాణా చేసినందుకు గాను ఏరియా జీఎం ఎం.శాలేంరాజును బుధవారం సీఎంఓఏఐ, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.రజాక్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, రమేష్ ఆజ్మీర శ్రీనివాస్, ఎ.ఉపేందర్‌బాబు, జీదుల రాజేశ్వరరావు, గౌస్, పోశం శ్రీనివాస్, మల్లారపు కొమరయ్య, విప్లవరెడ్డి, కల్వల శ్రీనివాస్, చిలక రాజయ్య, గోపు కుమార్, సంగారావు, మోహన్‌రెడ్డి, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'చలో సెక్రటేరియట్'

పాల్వంచ: ఈనెల 3న ఏఐఎస్‌ఎఫ్ చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.అజిత్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా భూములను కొల్లగొట్టేందుకు సిద్ధమైందన్నారు. దీంతో యూనివర్సిటీ ఉనికి ప్రమాదకరంగా మారుతుందన్నారు. కార్యయక్రమంలో గుండాల సుజన్, నితిన్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: మార్చి 23న ప్రారంభమైన మొక్కంపాడు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. 40 జట్లు పోటీల పాల్గొన్నాయి. బుధవారం కొత్తతండా కింగ్స్ (కేటీ కింగ్స్), మొక్కంపాడు జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో కేటీ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. రూ.15వేల నగదు, షీల్డ్ అందజేశారు. అదేవిధంగా ద్వితీయ, తృతీయ బహుమతులు కూడా అందజేశారు. టీచర్ బానోత్ రవి, మాలోత్ రాందాస్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తగూడెంఅర్బన్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ అన్నారు. బుధవారం రాజేందర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో ప్రారంభమైన భద్రాద్రి కొత్తగూడెం ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి హరిబాబు, యర్రా సర్వేష్, దేవర్లరాజు, లింగేష్, రాజరమేష్, కె.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: యువత చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వనజ అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో యాంటీ డ్రగ్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. మత్తు పదార్థాల వాడకం వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణచందర్ రావు, కోఆర్డినేటర్ డాక్టర్ బి.వెంకన్న, డాక్టర్లు వెంకటేశ్వర్లు, విద్యా ప్రవీణ, సుస్మిత, రజిని, అనురాధ, అంజనాదేవి, సునీత పాల్గొన్నారు.

తాగునీరు వృథా..



వాల్వ్ లీకైన దృశ్యం

పాల్వంచరూరల్: అసలే ఎండకాలం గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం రూ.లక్షల వ్యయం చేసి మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తోంది. కానీ కొన్నిచోట్ల అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా తాగునీరు వృథాగా పోతున్నాయి. మండల పరిధి కిన్నెరసాని పోలీసుస్టేషన్ సమీపంలోఉన్న మిషన్ భగీరథ ఓవర్ ట్యాంక్ వద్ద బుధవారం వాల్వ్ లీకయింది. దీంతో భారీగా నీరు వృథాగా పోతోంది. పదేపదే ఇలా జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడలేదని స్థానికులు వాపోతున్నారు.

బీమా చెక్కు అందజేత

టేకులపల్లి: పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ రాథోర్ అన్నారు. ఈ మేరకు బుధవారం తడికలపూడిలో రూ.2లక్షల పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ చెక్కును నామినీ మూతి లక్ష్మీకి అందజేశారు. మాట్లాడుతూ... తడికలపూడికి చెందిన మూతి లక్ష్మయ్య 2024లో పీఎంజేజేబీవై పథకంలో చేరారని, డిసెంబర్‌లో అతను మృతి చెందడంతో బీమా సొమ్మును నామినీకి ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

- 250 గజాల స్థలం, రూ.30 లక్షల వడ్డీలేని రుణం
- ఎన్నికల హామీలు అమలయ్యేనా..?
- సింగరేణి కార్మికుల ఎదురుచూపులు



కార్మికుల ఇళ్ల నిర్మాణంపై సింగరేణి సీఎండీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ సొంతింటి కల కలగానే మిగిలింది. సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేరుస్తామని డిసెంబర్ 2023లో జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో పలు కార్మిక సంఘాలు వారి, వారి మ్యానిఫెస్టోలో పెట్టి, హామీలు ఇచ్చిం లబ్ధిపొందాయి. ఇప్పటికి సుమారు 16 నెలలైన వాటి ఊసే లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. మరికొన్ని ప్రతిపక్ష సంఘాలు ఇటీవల కాలంలో కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. అంతేకాకుండా ఇటీవల జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు సంఘం యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చిన యాజమాన్యంలో స్పందన లేదని కార్మికులు ఆరోపిస్తున్నాయి.

ఇంటిస్థలంతోపాటు రుణం...

సింగరేణిలో పనిచేస్తున్న ప్రతీ కార్మికుడికి 250 గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని కొన్ని కార్మిక సంఘాల నాయకులు, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేతో కలిసి సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు.

దీంతోపాటు కోలిండియా ఉద్యోగుల వలె సింగరేణి కార్మికులు ఫెర్క్స్‌పై కట్టిన ఆదాయపు పన్ను చెల్లించాలని కొత్తడిమాండ్‌తో తెరపైకి వచ్చాయి. ఇదిలా ఉండగా తెలంగాణ ప్రభుత్వ హాయంలో కార్మికుల సొంతింటి కలను మార్చు చేసేందుకు గాను వడ్డీ లేని రూ.10 లక్షల రుణాన్ని ప్రవేశపెట్టారు. ఇదిలా ఉండగా, కొత్తగూడెం ఎమ్మెల్యే సింగరేణి సీఎండీని కలిసి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని కోరగా.. ఈ విషయమై కంపెనీ కూడా సానుకూలంగా ఉందని, త్వరలో కమిటీ వేసి, విధివిధానాలు రూపొందించాలనే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.

యాజమాన్యం ఆలోచిస్తోంది...



కార్మికుల సంక్షేమమే సింగరేణి ధ్యేయం. కాకపోతే లీగల్ సమస్యలు, ల్యాండ్ అప్రూవల్ సమస్యలు తలెత్తకుండా యాజమాన్యం సమాలోచన చేస్తోంది. దీనిపై త్వరలో కమిటీ వేయాలనే ఆలోచనలో ఉంది. ఈ విషయమై కార్మిక సంఘాలు వినతిపత్రాలు అందజేశాయి. ప్రభుత్వంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుని కార్మికులకు న్యాయం జరిగే విధంగా చూస్తాం.

– కే. వెంకటేశ్వర్లు, సింగరేణి డైరెక్టర్(పా)

కమిటీలతో కాలయాపన చేయొద్దు..



సింగరేణి కార్మికుల సొంతింటి కల విషయంలో యాజమాన్యం తాత్సారం చేస్తోంది. తమ యూనియన్ ఆందోళన చేసిన సమయంలో ఉప ముఖ్యమంత్రి, సీఎండీలతో చర్చించి, ఒప్పించాము. విధి విధానాలు కూడా అందించాము. యాజమాన్యం ఇటీవల నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశంలో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇంకా ఏమీ తెలుపలేదు.

– మంద నర్సింహారావు, సీఐటీయూ కార్యదర్శి

కార్మికులను మభ్య పెడుతున్నారు..



ఎన్నికల్లో మభ్యపెట్టటానికే కార్మికులకు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు హామీలు గుప్పిచ్చారు. వాటిని నమ్మి కార్మికవర్గం మోసపోయింది. సీఎండీ, డైరెక్టర్(పా), జేసీసీ సమావేశాలు నిర్వహించినా హామీలు కానీ, సర్క్యులర్లు జారీ చేసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్నా.. ఒక్క హామీ కూడా అమలు కాలేదు. వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం.

– రాజిరెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

శాశ్వత మార్కెట్ నిర్మించండి..

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో శాశ్వత వ్యవసాయ మార్కెట్ నిర్మించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను జూలూరుపాడులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్ మాట్లాడుతూ... ప్రస్తుత ఉపమార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయడంతో రైతులు, హమాలీలు, వ్యాపారుల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల్లో వ్యవసాయ మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టే విధంగా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ... శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బత్తుల గోపి, కల్తి బాబు, సీతయ్య, సురేష్, జాటోత్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ ఎస్.జయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.బాలాజీ నాయక్, సూపరింటెండెంట్ సుదర్శన్ పాల్గొన్నారు.

జైబాపు టౌన్ కన్వీనర్‌గా మహమ్మద్ గౌస్



కొత్తగూడెంఅర్బన్: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కొత్తగూడెం టౌన్ కన్వీనర్‌గా మహమ్మద్ గౌస్ నియామకం అయ్యారు. ఏసీసీ, టీపీసీసీ నిర్దేశించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం మండల కోఆర్డినేటర్లను జిల్లా డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య నియమించారు.

ఎస్సైకు పరామర్శ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో ఇంటిలిజెన్స్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న భూక్యా హరిసింగ్ భార్య భారతి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. బుధవారం కొత్తగూడెంలోని హరిసింగ్ నివాసంలో భారతి దశదిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ రోహిత్‌రాజు, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నాయకులు కోనేరు చిన్న హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రమేష్ అరెస్టు

ఇల్లెందురూరల్: మంత్రివర్గంలో బంజారాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ బుధవారం సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో పోలారం గ్రామంలో సేవాలాల్ సేన మండల శాఖ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్‌ను కొమరారం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

చిరుధాన్యాలు.. పోషకాల గనులు



స్టాల్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ కవిత, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: చిరుధాన్యాలు 'పోషకాల గనులు'అని వీటిని నిత్యం ఆహారంగా తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు సేకరించిన వివిధ రకాల మిల్లెట్స్, వాటితో తయారు చేసిన వంటలతో మిల్లెట్స్ మ్యాజిక్ పేరుతో బుధవారం స్టాల్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కవిత హాజరై స్టాల్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుందని, అధిక ఫైబర్ ఉండటంతో జీర్ణక్రియ మెరుగుపర్చడం, గుండె సంబంధిత వ్యాధులను తగ్గించడమే కాకుండా రక్తపోటు నియంత్రణలో ఉంటుందన్నారు. అధిక పరిమాణంలో కాల్షియం ఉండటం వల్ల ఎముకల బలానికి పెంచడంలోనూ తోడ్పడుతాయన్నారు. మిల్లెట్స్‌ను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా హార్మోన్ల సమతుల్యతను సాధించవచ్చన్నారు. నేటి బాలికలు ప్రధానంగా ఎదుర్కొంటున్న పీసీఓడీని, విటమిన్–బి కొరతను అధిగమించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సింగరేణి స్థలాన్ని ప్రైవేటుకు ఇవ్వొద్దు..



డైరెక్టర్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సత్తుపల్లి ఓసీ–3 అవంతిక కంపెనీకి ఆన్‌లైన్ టెండర్ వెళ్లిందని, వారికి ఓబీ పోయటానికి ఎక్కడా స్థలం లేదని, సింగరేణి స్థలం ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇవ్వరాదని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. ఈ మేరకు బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్లు, డైరెక్టర్(పా) కే.వెంకటేశ్వర్లు డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వీ సూర్యనారాయణకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... అవంతిక సింగరేణి స్థలాన్ని కాజేసేందకుకు అనేక ప్రయత్నాలు చేస్తోందన్నారు. కోయగూడెం ఓసీ త్రీ బ్లాకు 1/70 యాక్ట్‌లో ఉంది. అది చేపట్టడానికి కేవలం ట్రైబల్ సొసైటీలు కానీ, ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి కానీ చేపట్టడానికి మాత్రమే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా పూసపల్లి ఓసీ, వీకే–7 ఓసీలకు పర్మిషన్లు వచ్చేందుకు చొరవ చూపాలని, వీటిల్లో బొగ్గు ఉత్పత్తి పనులు కంపెనీ కార్మికులే చేపట్టాలని సూచించారు. స్పందించిన డైరక్టర్లు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు. వై.వెంకటేశ్వరరావు, గాజుల రాజారావు, సూరం అయిలయ్య, కొత్తపల్లి రమేష్‌బాబు, బ్రహ్మచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు సర్దార్ పాపన్న



కొత్తగూడెంఅర్బన్: నినాదాలు చేస్తున్న నాయకులు

బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ... బడుగుబలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన భారతదేశపు తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. పాపన్న ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. బహుజనులకు రాజ్యాధికారం సాధించిన నాడే ఆయనకు మనం ఇచ్చే నివాళి అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: బొమ్మనపల్లిలో..



చుంచుపల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పేదలకు సన్న బియ్యం పంపిణీ



టేకులపల్లి: సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తోందని ప్రతీ పేద సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు అన్నారు. 16వ వార్డులో రేషన్ దుకాణంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూర్య, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

టేకులపల్లి: రేషన్ బియ్యాన్ని ఎవరైనా డీలర్లు తప్పుదోవ పట్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం రేషన్ కార్డుదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కోయగూడెం గ్రామంలో అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం మాట్లాడారు.

జూలూరుపాడు: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం మాచినేనిపేట, జూలూరుపాడు గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదోడి కడుపునిప్పాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్వాతి బిందు, లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దొండపాటి శ్రీనివాసరావు, నున్నా రంగారావు, మల్లెల నాగేశ్వరరావు, సపావట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు జర్నలిస్టులకు వర్తింపజేయాలి..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు జర్నలిస్టులకు వర్తింపజేయాలని కోరుతూ జూలూరుపాడు వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇంటిస్థలాలు, రాజీవ్ యువ వికాసం పథకం కింద జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు.

నీటిఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: గ్రామాల్లో నీటిఎద్దడికి అవకాశం లేకుండా ప్రత్యామ్నాయ వనరులతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో ప్రభుత్వం నిర్దేశించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని కూలీలు ఇబ్బంది పడకుండా పని ప్రదేశాలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పంచాయతీలో ఐదుకు తగ్గకుండా ఫారంపాండ్‌ల నిర్మాణం జరిగేలా పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిజం అజేయం'



మాట్లాడుతున్న సాబీర్ పాషా

ఇల్లెందు: ఓట్లు సీట్లు గీటు రాయి కాదు.. ఎన్నటికీ కమ్యూనిజం అజేయమైందని, పోరాడేవాని చేతిలోనే ఎర్ర జెండా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. బుధవారం పట్టణంలోని నంబర్ 2 బస్తీలో 6వ వార్డు శాఖ మహాసభ జరిగింది. సాబీర్ పాషా మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న భారతదేశంలో భారత కమ్యునిస్టు పార్టీ ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు నిరంతరం పోరాటంలో ఈ ఎర్ర జెండా ఎగురుతూనే ఉందన్నారు. పీడిత ప్రజలకు సీపీఐ ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.సారయ్య, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, రాజారామ్, బాస శ్రీనివాసరావు, వడ్ల శ్రీను, వల్లాల రాజమౌలి, హరీష్, గీకూరు వెంకన్న, షేక్ వలీ, కొమురయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల వల్లే వందేళ్లు మనగలిగాం..

పాల్వంచ: ప్రజల పక్షాన చేసిన పోరాటాల వల్లే సీపీఐ వందేళ్లు మనగలిగిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. మంగళవారం రాత్రి పట్టణ పరిధిలోని వెంగళరావు కాలనీలో సీపీఐ శాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. కార్మికులు, శ్రామికులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామగ్రామాన, వార్డుల్లో సంబురాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావ్, నిమ్మల రాంబాబు, వైఎస్ గిరి, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'దేశం క్లిష్ట పరిస్థితిలో ఉంది'..



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు: పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తోందని, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. తొలుత అంబేద్కర్, కుమురంభీం విగ్రహాలకు, బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో భారతదేశం అత్యంత క్లిష్టపరిస్థితుల్లో ఉందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలను అణిచివేస్తోందని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యడవల్లి కృష్ణ, బానోతు రాంబాబు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూర్య, జానీపాషా, ఎస్‌కే జానీ, పింగళి నరేష్, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, జే.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

భూములు అమ్మితే పోరాటాలు తప్పవు



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు



టేకులపల్లి సెంటర్‌లో నిరసన ర్యాలీ చేపట్టిన సీపీఎం నాయకులు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధకాండను వ్యతిరేకిస్తూ సీపీఎం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్), అంబేద్కర్ పూలే మార్క్స్ కాన్షీరామ్ ఆశయాల వేదిక (ఏపీఎంకే) ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ర్యాలీలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం యూనివర్సిటీ స్థలాన్ని విక్రయించాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతోందన్నారు. భూములను కాపాడుకునేందుకు విద్యార్థులు సాగిస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలకు రాజకీయాలు అంటగట్టి ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తోందని విమర్శించారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు



సుజాతనగర్: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



జూలూరుపాడులో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు